క్లుప్తంగా

తహసీల్దార్‌గా అమరనాథ్



రొంపిచెర్ల: తహసీల్దార్‌గా ఇ.అమరనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. డీటీ కిరణ్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యల పరిష్కారానికిన వంతు కృషి చేస్తానని, రైతులకు సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వీఆర్వోలు, సర్వేయర్లు బాధ్యతగా పని చేయాలన్నారు.

విద్యార్థులకు అందని యూనిఫాం



పాత యూనిఫాంతోనే పాఠశాలలకు హాజరైన విద్యార్థులు

రొంపిచెర్ల: మండలంలో పాఠశాలలు పునః ప్రారంభమైనా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు యూనిఫాం ఇంతవరకు అందలేదు. మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలల్లో 2,287 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రభుత్వం పాఠ్య, నోటు పుస్తకాలు మంజూరు చేసింది. అయితే విద్యార్థులకు యూనిఫాం, షూలు ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పాఠశాలలు తెరచిన మొదటి రోజే అన్ని పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా తీర్చిదిద్దిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్కూళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ



ఎస్సీ బాలుర వసతి గృహంలో తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్

చౌడేపల్లె: ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్ మరుగుదొడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహంలో సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఈలు చందన, సురేష్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపి మంచి ఫలితాలు సాధించాలని నాబార్డ్ జిల్లా మేనేజర్ సునీల్ కోరారు. మంగళవారం మండలంలోని శ్రీరామాపురంలో శ్రీపాలేకర్ వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా అధిక దిగుబడి కోసం వేరుశనగ, కంది, ఉలవ, జొన్న పంటలో విత్తన శుద్ధి గురించి పుంగనూరు వ్యవసాయ శాఖ ఏడీఏ శివకుమార్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రఖీబా, ఏపీ మాస్ పీడీ వినాయక రెడ్డి, మేనేజర్ డాక్టర్ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు


రొంపిచెర్ల: పేద విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాసులు కోరారు. మంగళవారం రామచంద్రాపురం కాలనీలో బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను ఆయన కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు కంటే మిన్నగా పని చేస్తున్నాయని, అయితే విద్యార్థుల తల్లిదండ్రులు కొంతమంది ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపడం సరికాదన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అర్హత కలిగిన టీచర్లు ఉన్నారని, ప్రైవేటు స్కూళ్లలో అలా ఉండరని చెప్పారు. రామచంద్రాపురం కాలనీ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేశారని, ఇక్కడ ఐదుగురు టీచర్లు పని చేస్తారన్నారు. దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

మరో చెయిన్ లింక్ బిజినెస్..!

"మీరెన్నాళ్లు ఇలా కష్టాలతో బతుకుతారు..మీకు ఖరీదైన కారు, పెద్దబంగ్లా, సమాజంలో మంచి హోదా కావాలా!?.. అయితే మేం చెప్పినట్టు చేయండి.. మీరు లక్షాధికారులు, కోటీశ్వరులవుతారు'' పలమనేరులో ఇటీవల సాగుతున్న కొత్తరకం చెయిన్ లింక్ మీటింగ్‌కు హాజరైన వారికి దర్పంగా సూట్‌బూట్ వేసుకున్న వారు చెప్పిన మాటలివి! ప్రజలను ఇలా మాటలతో బురిడీ కొట్టించి, డబ్బులు దండుకునేందుకు మరో మల్టీ లెవెల్ బ్యాచ్ రంగంలో దిగింది. దీనిపై పారాహుషార్ అని పోలీసులూ హెచ్చరిస్తున్నారు.

- పలమనేరులో ఏజెంట్ల నియామకం
- డబ్బులు వసూలుకు రంగం సిద్ధం
- తొలుత రూ.20 వేలు కట్టాలట.. సూటు, బూటు తీసుకోవాలట!
- గుట్టుగా సమావేశాలు..సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయించి 'షో' చేస్తున్న వైనం
- ఇది మరో డాయ్ యాప్ కానుందనే అనుమానం
- ఇప్పటికే ఎన్నో ఎంఎల్‌ఎం మోసాలు
- చెయిన్ లింక్ బిజినెస్‌పై హెచ్చరిస్తున్న పోలీసులు

పలమనేరు: పలమనేరులో ఈమధ్య కాలంలో డాయ్ యాప్‌లో రూ.5కోట్ల వరకూ ప్రజలు మోసపోయారు. అతి తక్కువ వ్యవధిలో ఎక్కువ మొత్తం సంపాదించవచ్చు- అనే పాయింట్‌తో ప్రజలకు గాలం వేసి బురిడీ కొట్టించిన యాప్, మల్టీ లెవెల్ కంపెనీల బాగోతాలు పలమనేరుకు కొత్తేమీ కాదు. అయినా విరామం ఇచ్చి..మళ్లీ కొత్త తరహాలో టోకరా వేసేందుకు ఎంఎల్‌ఎం (మల్టీ లెవల్ మార్కెటింగ్) బ్యాచ్ పలమనేరులో దిగింది. కొందరికి ఈ ఊబిలోకి దించి, మరికొందరిని మోసం చేసేందుకు రహస్య సమావేశాలను నిర్వహిస్తున్నట్టు మంగళవారం వెలుగుచూసింది.



దీంట్లో ఎలాగంటే...!

ఇందులో సభ్యుడిగా చేరదలచిన వాళ్లు తొలుత రూ.20 వేలు కట్టాలట! ఆపై కంపెనీకి వీరికి రెండు జతల సూట్‌లు, బూట్లు, టైలను ఇస్తారట..! ఆపై వీరు కంపెనీ ప్రతినిధులు ఇచ్చే శిక్షణకు హాజరు కావాలి. ఆ తర్వాత వారిచ్చిన మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఈ తతంగం అంతా అయ్యాక ఆ కంపెనీకి చెందిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలట. సాధారణంగా మార్కెట్‌లో ఉండే టూత్ పేస్ట్ రూ.100 వరకూ ఉంటుంది. కానీ వీరు అమ్మే టూత్ పేస్ట్ ధర రూ.500గా ఉంది. దీన్ని కొన్న వారికి 20 బిజినెస్ పాయింట్లు వస్తాయి. ఇలా పలురకాల వస్తువులను కొంటూ రూ.20వేల బిజినెస్ పాయింట్స్ వస్తే ఆపై వీరు ఇతరుల నుంచి కమీషన్ పొందేందుకు అర్హులవుతారట! ఆపై వీరి ఇద్దరిని వారు మరో ఇద్దరిని.. ఇలా చెయిన్ లింక్ వ్యాపారాన్ని చేయాలి. దీంతో కిందివారు చేసే వ్యాపారంలో కమీషన్ పైనున్నవారికి చేరుతూ నెలకు లక్షల్లో సంపాదన ఉంటుందని ఊదరగొట్టినట్టు ఇటీవల జరిగిన రహస్య సమావేశానికి హాజరైన కొందరు తెలిపారు.

వీడియో ప్రదర్శనతో బ్రెయిన్ వాష్..!

ఈ రహస్య సమావేశాలకు వెళితే అందరూ సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయాలట! ఈ మీటింగ్‌కు వచ్చారంటే మీ జీవితాలు మారిపోతాయని, కోటీశ్వరులై పోతారని ఓ వీడియో ప్రదర్శనతో ఇట్టే కలల లోకంలో విహరించేలా చేస్తారట! వీడియో స్క్రీన్‌పై ఓ స్టోరీని చూపెట్టి, అందులో ఓ మహిళ కష్టాల్లో ఉన్న దృశ్యాలు.. ఆపై ఆమె ఇందులో చేరి 'డైమండ్' స్టేజికి వచ్చి, కోట్లు సంపాదించిందంటూ బెంజి కారులో దిగడం, ఆరుగురు బౌన్సర్లు, వజ్రాల నెక్లెస్‌తో దర్పంగా వెళ్లడం చూపి...మీరిప్పుడు కోటీశ్వరులు ఎందుకు కాకూడదంటూ బ్రెయిన్ వాష్ చేసి సభ్యులుగా చేర్పించుకున్నట్టు సమాచారం.

వీరి వలలో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారులు

ఇక్కడ జరుగుతున్న మార్కెటింగ్ మీటింగ్‌లకు ఎక్కువగా హాజరవుతున్న వారిలో ఉపాధ్యాయులు, వ్యాపారులు, యువకులు, నిరుద్యోగులు, స్వచ్ఛంద సంస్థలో పనిచేసే సిబ్బంది ఉండడం గమనార్హం! గతంలో పలమనేరులో జరిగిన రూ.5కోట్ల డాయ్ యాప్ మోసంలోనూ ఎక్కుగా మోసపోయింది ఉద్యోగులు, వ్యాపారులే. ఇప్పుడు ఇదే పలమనేరులో మరో మోసానికి రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

గతంలో డాయ్‌యాప్‌లో మోసపోయా...



నాకు తెలిసిన వాళ్లు చెప్పినమాట విని రెట్టింపు లాభం ఉంటుందని డాయ్ యాప్‌లో డబ్బులు కట్టా. మొదట్లో కొన్ని రోజులు డబ్బులు వచ్చాయి. దీంతో ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టా. ఆపై మొబైల్‌లో యాప్ కనిపించకుండా పోయింది. అప్పు చేసిన డబ్బు మొత్తం పోయింది. అప్పుడు గాని అర్థం కాలేదు నేను మోసపోయానని! కాబట్టి ఇలాంటి చెయిన్ లింక్ బిజినెస్‌లు ఎప్పుడూ ప్రమాదమే.

-అనిల్, పలమనేరు

యాప్‌లను నమ్మి మోసపోకండి



గొలుసుకట్టు, ఎంఎల్‌ఎం, ప్రొడక్స్ బిజినెస్ కమీషన్ మొదలైన వటిని నమ్మి డబ్బులు కట్టొదని చెబుతూనే ఉన్నాం. కానీ ఆశకు పోయి కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. ఈమధ్యనే పలమనేరులో డాయ్ యాప్‌లో వందలాదిమంది మోసపోయారు. మళ్లీ ఇలాంటి వాటిని నమ్మి మోసపోకండి. పట్టణంలో కొందరు రహస్యంగా మళ్లీ ఇలాంటి వ్యాపారాలకు మీటింగ్‌లు పెట్టినట్టు సమాచారం ఉంది. వీరిపై ప్రత్యేక నిఘా పెట్టాం.

-నరసింహరాజు, సీఐ, పలమనేరు

ఇది అమానుషం.. ఘోరం

- ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి



కుప్పం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిరీషాను పరామర్శిస్తున్న ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి

పలమనేరు: మహిళ అని కూడా చూడకుండా భర్త అప్పు చెల్లించలేదని భార్యను చెట్టుకు కట్టేసి దాడి చేస్తుంటే ఆమె బిడ్డ ఏడుస్తున్నా కనికరం చూపని అమానుష ఘటన సాక్షాత్తు సీఎం ఇలాఖాలో చోటుచేసుకోవడం దిగ్భ్రాంతి కలిగించిందని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పం మండలం నారాయణపురంలో జరిగిన ఘటనలో బాధితురాలు శిరీషాను మంగళవారం ఆమె కుప్పం ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. అధిక వడ్డీలతో ప్రజలను పీడించే ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే, వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి హంగేరి ఓబులురాజు సైతం బాధితురాలిని పరామర్శించారు.

తరగతుల విలీనంపై అభ్యంతరం

- విలీన స్కూళ్లకు పిల్లలను పంపమని తల్లిదండ్రుల స్పష్టీకరణ

గంగవరం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఇతర పాఠశాలలకు విలీనం చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయగా, అన్ని ప్రైమరీ పాఠశాలల్లోని మూడు తరగతులు ఆ పాఠశాలల్లోకి విలీనం అయ్యాయి. వీటిలో బత్తనపల్లె పాఠశాల చౌడిరెడ్డిపల్లె పాఠశాలకు, నాగిరెడ్డిపల్లె దండపల్లెకు, దిగువ వేమనపల్లె.. దండపల్లెకు, సామలగడ్డ-గంధ్రాజుపల్లె, మన్నార్‌నాయనిపల్లె-జరావారిపల్లె, కొంగోళ్ళపల్లె-జీడిమాకులపల్లె, జీఎల్ఎస్ ఫారం-జెడ్పీ హైస్కూల్, సామరాజుపల్లె-కల్లుపల్లె, మల్లేరు-కల్లుపల్లె, బూడిదపల్లె- కల్లుపల్లె, కీలపట్ల హరిజనవాడ-కీలపట్ల, కురప్పల్లె-మాదిగపల్లె, పాతకీలపట్ల-కీలపట్ల, మార్జేపల్లె-పసుపత్తూరు, తమ్మిరెడ్డిపల్లె-కలగటూరు పాఠశాలలకు విలీనం చేశారు. దీంతో స్వగ్రామాల నుంచి ఆమడ దూరంలో ఉన్న పాఠశాలలకు తమ పిల్లలను పంపడంపై తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. సామలగడ్డ, అబ్దుల్‌సాబ్ ఇండ్లు గ్రామాల పిల్లలను గంధ్రాజుపల్లెకు పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు.

పెన్షనర్ల అంత్యక్రియల సొమ్ము ఇవ్వండి ప్లీజ్..!

- ఎస్టీఓకు విశ్రాంత ఉద్యోగుల వినతి



ఎస్టీఓకు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పలమనేరు: మృతి చెందిన విశ్రాంత ఉద్యోగుల అంత్యక్రియల ఇవ్వాల్సిన నగదు కూడా ఆరునెలలుగా ప్రభుత్వం ఇవ్వడం లేదని, ఇకనైనా ఇవ్వాలని స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గురురాజారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పలమనేరు ఉపఖజానా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం ఇచ్చి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 1, 350మంది పెన్షనర్లు ఉన్నారని, వీరికి 2024-25 సంవత్సరానికి సంబంధించి ఫామ్-16, ఫామ్-26ఏలను ఇవ్వాలన్నారు. పెన్షనర్ల పే స్లిప్పుల్లో ఫ్యామిలీ పెన్షనర్ల పేరు, పుట్టిన తేదీ లేనివారి వివరాలను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈహెచ్ఎస్‌లో భార్యాభర్తల వద్ద సభ్యత్వం రికవరీ చేస్తున్నారని, దీనిని ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మోహన్, అంజప్ప, గురుస్వామి, వీరభద్రగౌడు, మాలతి, జ్ఞానాశ్వార్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

'విలీనం'పై ఆందోళన

- బడికి తాళం వేసి పాలమాకులపల్లె నిరసన



పాలమాకులపల్లె బడికి తాళం వేసి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ పాలమాకులపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తల్లిదండ్రులు మంగళవారం తాళం వేసి బడి ముందు ఆందోళన చేశారు. తమ గ్రామ బడిని రెండు కిలోమీటర్ల దూరంలోని దిగువకల్లాడు స్కూలులో విలీనం చేశారని, గ్రామంలోని స్కూలులో 30మంది పిల్లలున్నారని, వీరంతా ఎర్రగొండేపల్లె, కురప్పల్లె, జల్లిక్వారీ, హాచరీ ప్రాంతాల నుంచి వస్తున్నారన్నారు. అయితే విలీనం వల్ల 3,4,5 తరగతుల పిల్లలను దిగువ కల్లాడుకు పంపలేమని తేల్చిచెప్పారు. ఈ మార్గంలో విపరీతంగా జల్లి టిప్పర్లు వేగంగా వెళుతుంటాయని, దీంతో పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మరోవైపు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల వద్ద బ్లాస్టింగ్ చేస్తుంటారని, రోడ్డు పక్కనే భారీగా చెరువులా వరద నీరుందని..ఇవన్నీ పిల్లల భద్రతకు ఆందోళన కలిగించే అంశాలని చెప్పారు. అందుకే తమ గ్రామంలోని బడికి మాత్రమే పిల్లల్ని పంపుతామని స్పష్టం చేశారు. దీనిపై తాము అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయినా తమకు న్యాయం చేయాలని కోరారు.



రోడ్డుకు ఆనుకునే ఉన్న నీటి గుంతలు



మట్టి రోడ్డులో క్వారీ నుంచి వేగంగా వెళుతున్న జల్లి టిప్పర్లు

కూటమి దగాకోరు పాలన

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూర్తి స్థాయిలో నెరవేర్చని హామీలు
- టీడీపీ నాయకులు, మద్దతుదారులకే మామిడి టోకెన్లు
- పుస్తకావిష్కరణలో వైఎస్సార్ సీపీ నేతల విమర్శ



సదుంలో పుస్తకావిష్కరణలో నాయకులు



సోమలలో..

సదుం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడచినా హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తూ, దగాకోరు పాలన చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి విమర్శించారు. ఏడాది పాలనలో కూటమి మోసాలపై వైఎస్సార్ సీపీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకాలను మంగళవారం సదుంలో ఆవిష్కరించి మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో హామీలను నెరవేర్చి ప్రజారంజకంగా పాలిస్తే సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకనే అన్నీ అమలు చేశామని సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సంవత్సర కాలంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలేమిటో, కూటమి ప్రభుత్వం చేస్తున్న దగా ఏమిటో ప్రజలు గ్రహించారన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలేవీ?

జిల్లాలో గిట్టుబాటు ధర లభించక మామిడి, టమాటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మామిడి ఫ్యాక్టరీల వద్ద టీడీపీ నాయకులు, మద్దతుదారులకు మాత్రమే టోకెన్లు లభిస్తున్నాయని ఆరోపించారు. వేబ్రిడ్జి బిల్లుల ఆధారంగా మామిడి రైతులకు నగదు సాయాన్ని ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఉప సర్పంచ్ బాబురెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శివారెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, పుత్రాజు, ఎల్లారెడ్డి, కాలేశా, నాయకులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల మండల కేంద్రంలో 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ఏడాది పాలన అంతా అరాచకం, దౌర్జన్యం, దోపిడీ, విధ్వంసమేనని విమర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, సాంబయ్య, రమణ, ఖయ్యూం, వీ.రమణ, సీఎల్‌పీ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, నాగేంద్ర రెడ్డి, శీలం భాస్కర్ పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాదమునిరెడ్డి ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్‌బాషా, చంద్రశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వంగిమళ్ల లోకేష్ రెడ్డి, అహమ్మద్, గోవిందరెడ్డి, గోవర్ధన, నాగరాజ ప్రసాద్, మునిరత్నం, నటరాజ, నిరంజన్‌రెడ్డి, కోదండ, ఎస్వీ రమణ, దేవేంద్రరెడ్డి, శివ,సైదుల్లా తదితరులు పాల్గొన్నారు.

చిప్పిలివారిపల్లెలో..

రొంపిచెర్ల: మండలంలోని చిప్పిలివారిపల్లెలో 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకాలను ఎంపీపీ చిప్పిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, 'రెడ్ బుక్' అరాచకం కొనగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కరీముల్లా, రవీంద్ర, ప్రేమానందం, మహబూబ్‌బాషా, అల్లాబక్ష్, ఐడియా కాలేషా, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కూటమి పాలనను ఎండగట్టారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, తిరుమల ,గోవిందు రెడ్డి, విజయ్, ఆది, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రొంపిచెర్ల: చిప్పిలివారిపల్లెలో..



పలమనేరులో..

కరుణించమ్మా గంగమ్మా..!



దాసార్లపల్లెలో ఉత్సవమూర్తిగా అమ్మవారు

వి.కోట: మండలంలోని దాసార్లపల్లె, బసాపురం గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం నుంచి గ్రామాల్లో అమ్మవారి శిరస్సు ఊరేగించారు. అనంతరం మహిళలు దీపాలతో పూలగెరిగ, డప్పు, బాజా భజంత్రీలు, బాణసంచా వేడుకలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. సోమవారం రాత్రి దాసార్లపల్లెలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.